క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోండి..

• ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ



సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, హౌసింగ్ డీఈ అప్పయ్య

తెర్లాం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, బొబ్బిలి హౌసింగ్ డీఈ పలగర అప్పయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న గృహ నిర్మాణాలపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన 2,251 ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తయ్యేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు.

పశువులు, మూగజీవాలకు టీకాలు



కామన్నవలసలో టీకాల శిబిరాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి అనిత, తదితరులు

బాడంగి: మండలంలో నిర్వహిస్తున్న టీకాల శిబిరాలను రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ అనిత శుక్రవారం సందర్శించారు. శిబిరాల్లో పశువులకు గొంతువాపు వ్యాధి రాకుండా.. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేస్తున్నట్లు డాక్టర్ అనిత చెప్పారు. డొంకినవలస, కామన్నవలస గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలనలో నోడల్ అధికారితో పాటు బొబ్బిలి సబ్ డివిజన్ ఉప సంచాలకుడు ఆర్.నీలయ్య, విజయనగరం పశు వ్యాధుల నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకుడు రాంప్రసాద్, స్థానిక పశువైద్యుడు గోవింద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



ఫీల్డ్ అసిస్టెంట్‌ను గ్రామస్తుల సమక్షంలో విచారిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ, తదితరులు

మెంటాడ: మండలంలోని చింతాడవలస ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం విచారణ చేపట్టామని ఎంపీడీఓ తివిక్రమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉపాధి క్షేత్ర సహాయకుడు రామనాయుడు వలస వెళ్లిపోయిన వారికి, చనిపోయిన వారిపేరు మీద మస్తర్లు వేసి నిధులు స్వాహా చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. నివేదికను డ్వామా పీడీకి అందజేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఏపీఓ చినప్పయ్య ఉన్నారు.

విత్తనాల పంపిణీ



అంబఖండి ఆర్‌బీకే వద్ద వరివిత్తనాల పంపిణీ

రేగిడి: మండలంలో రైతులకు అన్ని రకాల వరి విత్తనాలు అందిస్తామని వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ అన్నారు. అంబఖండి రైతుభరోసా కేంద్రంలో చేపట్టిన విత్తనాల పంపిణీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మార్కెట్లో ప్రైవేటు కంపెనీల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం అన్ని రకాల విత్తనాలను అందిస్తోందని అన్నారు. ప్రస్తుతం మండలంలో రైతులందరికీ సరిపడ వరివిత్తనాలు అందుబాటులో ఉంచామని వివరించారు. మరికొన్ని రకాల విత్తనాలు మరో రెండు రోజుల్లో ఆర్‌బీకేలకు చేరుకుంటాయన్నారు.

ప్రభుత్వ విద్యకు పెద్దపీట



జేవీకే కిట్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వంగర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు యలకల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రుషింగి ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. నాడు–నేడుతో పాఠశాలల స్వరూపం మారిపోయాయని, ఏపీలో పాఠశాల విద్య దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ యలకల గున్నమ్మ, హెచ్ఎం దివాకర్, పంచాయతీ కార్యదర్శి దీప్తి తదితరులున్నారు.

పొలంబాట పట్టిన రైతన్న..



రొంపల్లిలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు



నాయుడువలసలో ఏరుతో మొక్కజొన్న వేస్తున్న రైతులు



మామిడివలసలో మొక్కజొన్న పంటలో తారెలు తీస్తున్న రైతులు

రెండు రోజులుగా కొద్దోగొప్పో వర్షాలు కురుస్తున్నాయి. ప్రభుత్వం కూడా అన్నదాతకు అండగా నిలుస్తూ రాయితీపై విత్తనాలు, ఎరువులు అందించింది. ఖరీఫ్ సాగుకు వాతావరణం అనుకూలించడంతో రైతన్నలు శుక్రజువారం పొలంబాట పట్టారు. వరి, పత్తి సాగుకు పొలాలు సిద్ధం చేయడంతో పాటు మొక్కజొన్న, కూరగాయల పంటల్లో కలుపు తీస్తూ రైతులు బిజీగా ఉన్నారు.

– రామభద్రపురం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



సారథిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

• ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అర్హతే ప్రామాణికంగా ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని సారథి గ్రామంలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అర్హత ఉంటే చాలు సచివాలయ వలంటీర్లు ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని గుర్తుచేశారు. ప్రతీ ఇంటికి సగటున ఏడాదికి రూ.1.50 లక్షలు నుంచి రూ.3 లక్షలు వరకు లబ్ధి చేకూరిందన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను 99 శాతం మేర నెరవేర్చినట్లు చెప్పారు. నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని పేర్కొన్నారు. నాడు–నేడు పనులతో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని వెల్లడించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి ప్రజాధనాన్ని దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. పచ్చచొక్కాలు వారికే పథకాలు అందించారని, పేదలను పట్టించుకోలేదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని నమ్మి ఓట్లు వేస్తే భవిష్యత్ అంధకారంగా మారుతుందని, ప్రజలు గుర్తించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, దూబ గోపాలం, కిలారి శ్రీనివాసరావు, కొల్లి మోహన్, మజ్జి సూరప్పనాయుడు, సూర్యనారాయణ, అడపా తవిటినాయుడు, టి.లక్ష్మున్నాయుడు, శాసపు వేణుగోపాలనాయుడు, ఆర్నిపల్లి వెంకటనాయుడు, పాలవలస శ్యామ్, పిట్టా జగదీష్, చల్లా జయరాం, యందవ చినబాబు, ముగడ రవి, మున్సిపల్ కార్యాలయ ఏఈ భాగ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శశికళ

రేగిడి: మూడు సంవత్సరాల వయసు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని రేగిడి సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ సూచించారు. ఆర్.ఆమదాలవలస అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని అందిస్తోందని, వాటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో కె.రమణమ్మ, టి.రాములమ్మ, మేరీ, అరుణకుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి గృహ సందర్శన

బాడంగి: మండలంలోని 17 గ్రామ సచివాయాల పరిధిలో తమకు కేటాయించిన కుటుంబాలను వలంటీర్లు శనివారం నుంచి గృహ సందర్శన పేరిట కలిసి సమస్యలు తెలుసుకుంటారని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, మంజూరు కాని సంక్షేమ పథకాలు ఏమైనా ఉన్నాయా.. ధ్రువపత్రాలు ఏమైనా కావాలా.. తదితర వివరాలు తెలుసుకుని మంజూరు చేయిస్తారని చెప్పారు.

బాడంగిలో వర్షం

బాడంగి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. ఈ వర్షం సాధారణ వర్షాకాలం ప్రభావంతో కురిసిందేనని, తుఫాన్ ప్రభావం కాదని మండల సహాయ గణాంకాధికారి రజని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు ఈ వర్షం ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. రైతన్నలు కూడా వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. కొద్ది రోజులుగా భానుడి ప్రతాపంతో అల్లాడిన ప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఉపశమనం లభించినట్టైంది.

అర్హులందరికీ పథకాలు చేరాలి



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి చేరాలని కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు.సీఎం జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని మున్సిపాలిటీ పరిధి మిర్తిరెడ్డి సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. అనంతరం సిబ్బంది, వలంటీర్లకు ఈ కార్యక్రమం అమలుపై దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి వారికి పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మేనేజర్ ఎంవీ నాగరాజు, ఏఈ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేద్దాం..

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మున్సిపల్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్, సిబ్బంది, తదితరులు



సంతకవిటి: జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, అధికారులు



రామభద్రపురం : ముఖ్యమంత్రి సందేశాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి



బాడంగి : కార్యక్రమాన్ని తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బొబ్బిలి: ప్రజలకు అవసరమైన వివిధ ధ్రువపత్రాలను ఫీజు లేకుండా అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించిన సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళి, రమాదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ లబ్ధి..

రామభద్రపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి అన్నారు. స్థానిక సచివాలయం –2లో జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమామణి, తహసీల్దార్ రాజారావు, సూరింటిండెంట్ అక్కారావు, ఈఓపీఆర్డీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

తెర్లాంలో..

తెర్లాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించగా, మండలంలోని అన్ని ఆర్బీకేల్లో ఆయన సందేశాన్ని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు విన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ పాల్గొన్నారు.

బాడంగిలో...

బాడంగి: తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించడాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు తిలకించారు. స్థానిక మండలాభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, మండల వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, మూడడ్ల భాస్కరరావు, తహసీల్దార్ ఆజూరఫీజాన్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ హాజరై కార్యక్రమాన్ని వీక్షించారు.

రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయగా.. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు వీక్షించారు. అనంతరం ఈ కార్యక్రమం అమలుపై అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్షించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరమైన తొమ్మిది రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంతో పాటు అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు పొందని వారుంటే వారిని గుర్తించి పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు.



రాజాం: వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రసంగాన్ని వింటున్న ఎంపీపీ లావేటి సులోచన, తదితరులు



రేగిడి: ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తున్న ఎంపీపీ దార అప్పలనరసమ్మ, తదితరులు



వంగర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వింటున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ నాయకులు, అధికారులు

త్వరితగతిన రీ సర్వే



సర్వే సిబ్బందికి ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: పట్టణ సర్వేలో చాలా జాగ్రత్తలు తీసుకుని సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. రీ సర్వే కోసం ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను ఎమ్మెల్యే శంబంగి శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు, భూ యజమానుల సమక్షంలో కచ్చితత్వంతో సర్వే పూర్తి చేసి హద్దు రాళ్లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళి, రమాదేవి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యం తగదు

• జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు



సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు

సంతకవిటి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా మనబడి నాడు–నేడు కార్యక్రమం అమలు చేస్తున్నారని, అభివృద్ధి పనుల్లో జాప్యం తగదని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.వి.రవికుమార్‌తో కలిసి ఎంఈఓలు, ఎస్ఎస్ఏ ఏఈ, హెచ్ఎంలు, సచివాలయ ఇంజినీర్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో జరుగుతున్న 'నాడు–నేడు' పనుల ప్రగతిపై ఆరా తీశారు. నిధులున్నా పనులు నత్తనడకన సాగుతుండడంతో అధికారుల అలసత్వంపై అసహనం వ్యక్తం చేశారు. హెచ్ఎంలు, సచివాలయ ఇంజినీర్లు సమన్వయంతో పనిచేసి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పనుల్లో పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్ఏ ఏఈ దాలయ్యకు, ఎంఈఓలు బి.శాంతకుమారి, ఎంఈఓ–2 సీహెచ్.భాస్కరరావులకు సూచించారు.

ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలపై ప్రత్యేక శ్రద్ధ



మెట్టవలసలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్

బొబ్బిలి: ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలు, పథకాలు, కార్యక్రమాల అమలుపై దృష్టి సారించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, నవరత్నాలు, జగనన్న సురక్ష జిల్లా ప్రత్యేకాధికారి ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని మెట్టవలస సచివాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. పథకాలు అమలుపై సమీక్షించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నాడు–నేడు కింద నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. పాఠశాలల భవనాలన్నీ ఒకే కాంపౌండ్‌లో ఉండాలని సూచించారు. వేగవంతంగా బిల్లులు చెల్లిస్తున్నందున భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ పి.శేషశైలజ, పీఆర్ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు, ఎంపీడీఓ పోతుల రవికుమార్, ఎంఈఓ చల్ల లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: బొబ్బిలి డివిజన్ పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో కలువరాయి ఫీడర్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పూడి హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఏడు గంటల నుంచి పది వరకు కలువరాయి. జగన్నాథపురం సబ్‌స్టేషన్ల పరిధిలో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపుపై దృష్టి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరీక్షిస్తున్న ఎంఈఓ

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. రేగిడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించి, వివరాలు సేకరించారు. పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలని హెచ్ఎం ఎం.అప్పారావుకు సూచించారు. ఉపాధ్యాయులు టి.మంగమ్మ, లీలా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అర్చకులకు గౌరవ వేతనం మంజూరు

బొబ్బిలి: టీటీడీ, సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో నిర్మించిన ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు గౌరవ వేతనం (రూ. 5 వేలు చొప్పున) మంజూరైందని సమరసతా సేవా ఫౌండేషన్ డివిజన్ ధర్మ ప్రచారకుడు ధూపం వాసు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో 27 ఆలయాలను నిర్మించామని, అర్చకుల బ్యాంక్ ఖాతాలకు వచ్చే నెల నుంచి గౌరవ వేతనం జమవుతుందని చెప్పారు.

చెడు అలవాట్లతో భవిష్యత్ అంధకారం

రాజాం సిటీ: విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలై జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని ఎస్సై పి.నీలావతి అన్నారు. స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో శుక్రవారం మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశ జీవితంలో ఓ తీపిగుర్తుగా ఉండాలని, కానీ చెడు అలవాట్లకు లోనై జీవితాన్ని పాడుచేసుకోవద్దని సూచించారు. బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

25న రా.ర.వే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 25న రాజాం రచయితల వేదిక సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రచయిత డాక్టర్ ఆల్తి మోహనరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రాజాపు శాంతారావు 'అర్ధనారి నవల–సామాజిక పరిశీలన' అనే అంశంపై ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రచయితలు, తెలుగు భాషాభిమానులు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని కోరారు.

పైపులైన్ పునరుద్ధరణ



పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జెడ్పీటీసీ బండి నర్సింహులు చర్యలు చేపట్టారు. గ్రామంలోని పైపులైను పాడవడంతో నీరు వృథాగా పోతోంది. సమస్యను గ్రామస్తులు జెడ్పీటీసీ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు శుక్రవారం గ్రామానికి వచ్చి పైపులైన్ మరమ్మతులు చేపట్టారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి



పారిశుద్ధ్య కార్మికులకు శానిటేషన్ కిట్లు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

రాజాం: పారిశుద్ధ్య పనులు చేసే సమయంలో కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలని పూణేకు చెందిన కేఏఎం ఫౌండేషన్ రిసోర్సుపర్సన్లు కృష్ణ, చిన్ని కృష్ణ, మితాసింగ్‌రాయ్ సూచించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం వద్ద జీఎంఆర్ వీఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పనులు చేసే సమయంలో చేతులకు గ్లౌజులు వేసుకోవడం, మాస్కులు ధరించడం చేయాలని, ప్రతీ నెల ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని, వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వెంటనే చికిత్స తీసుకోవాలని సూచించారు. సరైన రక్షణ లేకుండా డ్రైనేజీలో దిగరాదని హెచ్చరించారు. అనంతరం కార్మికులకు శానిటేషన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్‌వీఎఫ్ జనరల్ మేనేజర్ కె.జయకుమార్, ప్రతినిధులు కె.శివమోహన్, ఆర్.అప్పలనాయుడు, ఎల్.రాజు, పి.జనార్దనరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బొబ్బిలి: పట్టణంలోని రెండో వార్డు కౌన్సిలర్ కోట పెదరాములు ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న ఆయనను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, కౌన్సిలర్లు ఉన్నారు.